క్లుప్తంగా

1న తలనీలాల వేలం పాట

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని పాలకొండల్లోగల శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయానికి సంబంధించిన తలనీలాలను సేకరించే హక్కుకోసం జనవరి 1న వేలం పాట నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ బి.రెడ్డెయ్య యాదవ్, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ తెలిపారు. పుట్లంపల్లె పరిధిలోని ఈ ఆలయంలో భక్తులు సమర్పించనున్న తలనీలాలు సేకరించే హక్కుతోపాటు ఆ ప్రాంతంలో టెంకాయలు విక్రయించేందుకు కూడా వేలం పాట నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించి బుధవారం ఉదయం 10 గంటలకు కడప నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ కార్యాలయంలో జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం పాట నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలకు 73963 54149 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

శనిత్రయోదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శనేశ్వరస్వామి

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా శనేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోగల నవగ్రహ మండపంలోని శనీశ్వరస్వామికి ఈ సందర్భంగా తైలాభిషేకం నిర్వహించారు. ఈరోజున ఆ స్వామికి పూజలు నిర్వహించడంతో కష్టాలు దరిచేరవన్న విశ్వాసంతో భక్తులు విశేష సంఖ్యలో హాజరై తైలాభిషేకంతో పూజలు చేశారు. తొలుత ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు పూజలు చేశారు. జనవరి 11వ తేదీ కూడా శనీశ్వరపూజలు, తైలాభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యుత్ బిల్లులను ఆదివారం అయినప్పటికీ ఆయా వసూలు కేంద్రాలలో స్వీకరించడం జరుగుతుందని ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు హరిసేవ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్, ఎన్జీఓ కాలనీ, పాత కలెక్టరేట్, రామరాజుపల్లె, బాలాజీనగర్ ప్రాంతాల్లోగల తమ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. వినియోగదారులు ఆయా కేంద్రాల్లో బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు కవితల పోటీ

కడప కల్చరల్ : ఫిబ్రవరి 8, 9 తేదీల్లో కడప నగరంలో జరగనున్న వైఎస్సార్‌జిల్లా రచయితల సంఘం రెండవ సభల్లో విద్యార్థులకు ప్రత్యేకంగా కవితల పోటీ నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. హైస్కూలు విద్యార్థులకు వేమన, సుమతీ శతకాలు, బ్రహ్మంగారి కాళికాంబ సప్తశతిలోని పద్యాల పఠనం, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు కవిత పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి విభాగంలో ప్రథమ బహుమతిగా రూ. 2 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 1500, తృతీయ బహుమతిగా రూ. 1000 అందజేస్తామని, ఇవిగాక ఏడుగురికి ప్రోత్సాహక బహుమతులు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు.

కార్యక్రమాలు రద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో ఏడు రోజుల పాటు పార్టీ కార్యక్రమాలను రద్దు చేసినట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు ఎలాంటి కార్యక్రమాలను, నూతన సంవత్సర వేడుకలను నిర్వహించరాదన్నారు. తర్వాత 2025 జనవరి నుంచి పార్టీ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

చౌకదుకాణ డీలర్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏడు మండలాల్లో ఉన్న 153 చౌక దుకాణాల నిర్వహణకు డీలర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు మండలంలో 18 దుకాణాలకు, చింతకొమ్మదిన్నె మండలంలో 20, కడప మండల పరిధిలో 33, కమలాపురం పరిధిలో 28, ఖాజీపేట మండల పరిధిలో 36, పెండ్లిమర్రి పరిధిలో 8, వల్లూరు పరిధిలో 10 దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. జనవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించారు. అభ్యర్థులు ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులై 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు దుకాణానికి సంబంధించి రిజర్వేషన్ మేరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

డీఈఓ మీనాక్షి



మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి



హాజరైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: ప్రజలను పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యులను చేయాలని అప్పుడే పాఠశాలలు సకాలంలో అభివృద్ధి చెందుతాయని జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి పిలుపునిచ్చారు. కడప ఎర్రముక్కపల్లెలోని గ్రంథాలయ సమావేశ మందిరంలో శనివారం కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారులు కేశవరెడ్డి, దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా కమిటీలను బలోపేతం చేయడం ద్వారా పాఠశాలలు బలోపేతం కాగలవని ఆమె ఆకాంక్షించారు. ప్రతి కమిటీ మెంబర్ తమ బాధ్యతలను తెలుసుకొని పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని కోరారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మాసం విద్యా కమిటీ సభ్యులతో తప్పక సమావేశం నిర్వహించి నివేదికలు తయారు చేసుకోవాలన్నారు. ఆర్‌జేడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు మెరుగైన అభ్యసన సాధించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం అవసరమ న్నారు. ఈ సమావేశంలో ఆర్పీలు అపర్ణ, సురేష్ కుమార్, నాగేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొని పాఠశాల విద్యా కమిటీల బాధ్యతలను, ప్రజల భాగస్వామ్యం అవసరాన్ని, బాలల హక్కులను, పిల్లల మానసిక స్థితిగతుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



కడప నగరానికి చేరుకున్న స్వర్ణోత్సవాల ప్రచార జాత

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాకినాడలో జరగబోవు స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాళెం మహేష్ బాబు కోరారు. శనివారం మహాసభలకు సంబంధించిన ప్రచార జాత కార్యక్రమం కడప జిల్లాలో జమ్మలమడుగు నుండి ప్రారంభమై ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేల్ మీదుగా కడపకు చేరుకుంది. కడపలో వై జంక్షన్ వద్ద ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. అక్కడి నుండి బాలాజీ నగర్‌లోని యూటీఎఫ్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి జిల్లా కార్యాలయంలో స్వర్ణోత్సవ జాత ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఒక చారిత్రక అవసరంతో ఆవిర్భవించిన యూటీఎఫ్ 50 సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యారంగంలోను, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ప్రచార జాతాకు మద్దతుగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.మనోహర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, ఎల్ఐసి ఉద్యోగుల నాయకులు రఘునాథరెడ్డి, ఏపీజీబీ బ్యాంక్ ఉద్యోగుల నాయకులు జగదీశ్వర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు రవికుమార్, సుజాత రాణి, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓబుల్ రెడ్డి, కృష్ణారెడ్డి, రూతు ఆరోగ్య మేరీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు గోపీనాథ్, కరిముల్లా, వీరనారాయణ, అబ్దుల్ ఘని, శివశంకర్, సూర్య కుమార్, సుబ్బారావు, కేదార్నాథ్ పాల్గొన్నారు.



స్తంభించిన రాకపోకలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర శివార్లలోని ఊటుకూరు వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద శనివారం మధ్యాహ్నం రాకపోకలు స్తంభించాయి. నగర శివార్లలోని రిమ్స్ పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వచ్చి వెళ్లేంతవరకు పోలీసులు ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నిలిపివేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు రింగ్ సర్కిల్ మార్గాన గాలివీడు మండలానికి డిప్యూటీ సీఎం వెళ్లారు. అయితే ఆయన వెళ్లిన అరగంట పాటు ట్రాఫిక్ నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

డిప్యూటీ సీఎంకు న్యాయవాదుల వినతి

కడప అర్బన్: ఉమ్మడి జిల్లాలలో పర్యటించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను రాయచోటిలోని గెస్ట్‌హౌస్‌లో కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్ప నాయుడు ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం సాయంత్రం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈగల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జీ.వో నెం. 145 నిలుపుదల చేయాలని కోరుతూ కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా న్యాయవాదులు 19 రోజులుగా రిలే నిరాహార దీక్షలను చేస్తున్నామని ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. న్యాయవాదులతో పాటు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య కృష్ణరెడ్డి కూడా పవన్‌కళ్యాణ్‌కు సమస్య వివరించారు. వీరితో పాటు సీనియర్ న్యాయవాదులు జయరామిరెడ్డి, చిన్నయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపు ఉత్సాహంగా సాగింది. దంతవైద్యురాలు డాక్టర్ కె. ఉజ్వల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంపులో విద్యార్థినులకు దంతపరీక్షలు నిర్వహించడంతో పాటు స్కిన్‌కు సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. హెయిర్‌ఫాల్ సమస్యలు, మొటిమలు, మంగు నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా, కళాశాల వసతిగృహ డిప్యూటీ వార్డెన్ డాక్టర్ బి. స్వరూప, వైస్ ప్రిన్సిపాల్ డా. పి. గురివిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు, డా. జి. విజయలక్ష్మి, సి.వి.కృష్ణవేణి పాల్గొన్నారు.

ధర్నా తాత్కాలిక వాయిదా



ఆర్‌జేడీ శామ్యూల్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా విద్యాశాఖ అధికారి వైఖరికి నిరసనగా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ధర్నా నిర్వహించేందుకు నోటీసు ఇచ్చామని, అయితే కడప ప్రాంతీయ విద్యా సంచాలకులు శామ్యూల్ విజ్ఞప్తి మేరకు ఆ ధర్నా తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. శనివారం కడప ప్రాంతీయ విద్యా సంచాలకులు శామ్యూల్ తమ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని, తగు చర్యల నిమిత్తం సమయం ఇవ్వాలని అన్నారు. అందుకు ఉపాధ్యాయ సంఘాల వేదిక సమ్మతించి తాత్కాలికంగా ధర్నాను వాయిదా వేసింది. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు ఎస్టీయూ నాయకులు సంగమేశ్వర్ రెడ్డి, ఇలియాస్ బాష, యూటీఎఫ్ నాయకులు రవి, ఇజియాజ్ అహ్మద్, పీఆర్‌టీయూ నాయకులు మోపూరి శివారెడ్డి, తిరుపాల్, ఏపీటీఎఫ్ 257 నాయకులు, ఏపీటీఎఫ్1938 నాయకులు, పీఎస్‌టీయూ, ఆర్‌యూపీపీ , ఆపస్ నాయకులు, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ నాయకులు, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకులు, ఆర్జేయూపీ నాయకులు, ఎస్టీఎఫ్ నాయకులు , ఎస్ఆర్‌టీఎఫ్, ఎన్‌టీఏ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీదారుని ఇంటిని సందర్శించాలి

వల్లూరు : రెవెన్యూ సదస్సులో తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక అర్జీదారుని ఇంటికి వెళ్లి సమస్యను పరిష్కరించ డానికి అధికారులు కృషి చేయాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆర్‌డీవో కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవాణి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానం ఎంతో అవసరం



ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు



ప్రదర్శన తిలకిస్తున్న యువత

వైవీయూ: శాస్త్రీయ విజ్ఞానం ద్వారా దేశాన్ని ముందు వరుసలో ఉంచాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలఓబయ్య, సభ్యులు సునీత పిలుపునిచ్చారు. శనివారం ఉదయం యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఇంటర్ డిస్టిక్ యూత్ ఎక్చేంజ్ కార్యక్రమంలో మూడవ రోజు సైన్సు, మూఢ నమ్మకాలపైన విశాఖ యువతకు అవగాహన కల్పించారు. దేశంలో బలులు, చేతబడులపై ప్రచారం కల్పిస్తున్నారని అలాంటి వాటిని నమ్మకుండా ప్రజలు దూరంగా ఉండాలని అన్నారు. ప్రజలకు సుఖమయ జీవితాన్ని అందించే సైన్సును సమాజంలో ముందుకు తీసుకువెళ్లే బాధ్యత యువత తీసుకోవాలని కోరారు. నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్‌దాస్ మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో ఎదిగేందుకు నిరంతర శ్రమ, కృషి, పట్టుదల అవసరమని పేర్కొన్నారు. చెకుముకి జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు సైన్స్ పట్ల అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం కొనసాగింది.

బ్రౌన్ కేంద్రాన్ని సందర్శించిన విశాఖ జిల్లా యువత

సమాజంలోని విషయాలను ప్రజలకు తెలియజేసే గ్రంథాలయాలను యువత నిరంతరం సందర్శించుతూ ఉండాలని రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ చింతకుంట శివారెడ్డి కడప జిల్లా ప్రాముఖ్యతను వివరించారు. ఆనాటి రచయితలు తాళపత్ర గ్రంథాల పైన ఏ విధంగా అక్షరాలను లిఖించారన్న విషయాన్ని యువజనులకు తెలియజేశారు. పుస్తకాలను చదవడం ద్వారా చరిత్ర ఆనవాళ్లను తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు.

పెద్దదర్గా సందర్శన..

చారిత్రక ప్రదేశాలను సందర్శించడం ద్వారా యువతకు పురాతన ప్రదేశాల పైన మమకారం ఏర్పడుతుందని దర్గా మేనేజర్ అలీ ఖాన్ అన్నారు. జిల్లాలో ప్రాముఖ్యత కలిగిన అమీన్ పీర్ దర్గాను విశాఖ యువత సందర్శించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప కల్చరల్: రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగాలని కోరుతూ 'రాయలసీమ అభివృద్ధి వేదిక' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు అభివృద్ధి వేదిక ప్రతినిధులు రఘునాథరెడ్డి, డాక్టర్ ఓబుల్‌రెడ్డిలు తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరగనున్న ఈ సమావేశానికి రాయకీయ ప్రముఖులతోపాటు కర్షక, పారిశ్రామిక, విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు హాజరవుతారని వారు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కడపలోనే నూతన గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయంగా కొనసాగించవచ్చని స్పష్టం చేస్తున్నప్పటికీ, అమరావతికి తరలించే ప్రయత్నం జరుగుతుందన్న వార్త ఈ ప్రాంత వాసులకు ఆందోళన గురిచేస్తున్నదని తెలిపారు. మన రాష్ట్రంలో విలీనం అవుతున్న నాలుగు గ్రామీణ బ్యాంకులలో కడప కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అన్ని రంగాలలో ఎంతో పెద్ద బ్యాంకుగా అవతరించి ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో పౌర సమాజ ముఖ్యులు ఆదివారం జరిగే రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయాలని వారు కోరారు.

సంక్రాంతి సంబరాలకు సిద్ధం



సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్న వైవీయూ అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ: సంప్రదాయ బద్ధంగా పండుగల నిర్వహణను నేటి యువతకు పరిచయం చేస్తూ అంబరానికి అంటేలా సంబరాలను వైవీయూ గురుకులం ప్రాంతంలో ఈ నెల 31వ తేదీ నిర్వహిస్తున్నట్లు వాణిజ్య శాఖ విభాగాధిపతి ఆచార్య జి. విజయభారతి తెలిపారు. వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రధాన ఆచార్యులు రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది హాజరు కావాలని ఆమె కోరారు.

ఎంపీడీఓపై దాడికి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జెడ్పీ ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై మండల స్థాయి నాయకుడు జల్లా సుదర్శన్‌రెడ్డి దాడి చేయడాన్ని ఖండిస్తూ శనివారం జిల్లా పరిషత్ ఉద్యోగులు జెడ్పీ ఆవరణలో తమ నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓపై దౌర్జన్యానికి పాల్పడటం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వం వెంటనే బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు నాగిరెడ్డి, లంకా మల్లేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీ ఎంతో మేలు



నిర్వాహకుల నుంచి మెమొంటో అందుకుంటున్న డాక్టర్ జహంగీర్‌బాష

కడప రూరల్: కడప నగరంలోని జేబీ ఆసుపత్రిలో అడ్వాన్స్ రోబోటిక్ రీ ప్లేస్‌మెంట్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు ఆర్థోపెడిక్ వైద్యులు జహంగీర్‌బాషా తెలిపారు. హైదరాబాదులో నిర్వహించిన రోబోకాన్ సదస్సుకు డాక్టర్ జహంగీర్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం స్థానిక ఆసుపత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు హైదరాబాదులో నిర్వహించిన రోబోటిక్ కీళ్ల మార్పిడి సదస్సుకు హాజరైనట్లు తెలిపారు. ఈ సదస్సుకు ప్రపంచం నలుమూలల నుంచి ఆర్థోపెడిక్ రంగంలో పేరుగాంచిన వైద్యులు హాజరై తమ అనుభవాలను, భవిష్యత్తులో అందుబాటులోకి రానున్న సాంకేతిక పరిజ్ఞానం వివరించారన్నారు. కాగా తమ ఆసుపత్రిలో ఇప్పటికే అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోబోటిక్ టెక్నిక్ ద్వారా ఖచ్చితమైన సర్జరీ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఆ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ జయభారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌రావుకు డాక్టరేట్



వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర పరిశోధకుడు జి. ప్రసాద్‌రావుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయ ఆచార్యులు జి. పార్వతి పర్యవేక్షణలో 'ఫర్మామెన్స్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ప్రైమరీ హెల్త్‌సెంటర్స్ ఇన్ వైఎస్‌ఆర్ కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని గాంధీనగర్ నగరపాలకోన్నత పాఠశాల క్రీడాకారులు జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ క్రీడాపోటీలకు ఎంపికవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. అఫ్రీవున్ అభినందించారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు పల్నాడులో నిర్వహించనున్న ఫ్లోర్‌బాల్ నేషనల్ గేమ్స్‌కు పయనమవుతున్న క్రీడాకారులను అభినందించారు. కాగా చిలకలూరిపేటలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో అండర్–17 విభాగంలో రెండోస్థానం, అండర్–14 విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే.
ఎన్‌జీఓ సంస్థల ప్రతినిధులు కన్న, భరత్, విష్ణువర్ధన్‌లు క్రీడాకారులకు అవసరమయ్యే రవాణచార్జీలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎంఈఓకు వినతి



ఎంఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ కడప నగరశాఖ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర పాలక సంస్థలోని నగరపాలక ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు నగర పాలక ఉన్నత పాఠశాలలలో సర్దుబాటు చెయ్యాలని ఎస్టీయూ నగరశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాదిక్‌అలీ, సంజీవరాయుడులు కోరారు. ఈ విషయమై శనివారం కడప మండల విద్యాధికారి గంగిరెడ్డిని కలిసి ఎస్టీయూ కడప నగర శాఖ తరపున వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కాంప్లెక్స్ పరిధిలో మునిసిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలలు ఇతర మేనేజ్‌మెంట్ లోకి, తెలుగు పాఠశాలలు ఉర్దూ కాంప్లెక్స్ లోకి మాపింగ్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం సీఎస్‌సీ అధికారులు మార్పులు, చేర్పులకు అవకాశం ఇచ్చారన్నారు. ఎస్టీయూ జిల్లా మున్సిపల్ కన్వీనర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు పాఠశాలలు తెలుగు కాంప్లెక్స్‌లో, ఉర్దూ పాఠశాలలు ఉర్దూ కాంప్లెక్స్ పరిధిలో ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా మున్సిపల్ కమిటీ సభ్యులు ఎస్‌ఎండి దావూద్, ఎస్టీయూ నగర శాఖ నాయకులు ఆసిఫ్ అహ్మద్ బాషా, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి వితరణ



వంటపాత్రలు అందచేస్తున్న హిమవర్షిణి ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు

కడప అర్బన్: కడప నగరంలోని రవీంద్రనగర్‌లో నందిని, శ్రీరామ్ ఇంటిలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి అగ్నిప్రమాదం జరిగింది. కాగా హిమవర్షిణి ఫౌండేషన్ అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి ఈ సంఘటనకు స్పందించి బాధిత కుటుంబానికి తమ వంతు సహకారంగా నూతన వంట సామాగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, బధిరుల సేవాసంస్థ నిర్వాహకులు ఆల్‌షిఫా రఫీ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ఆర్ట్స్ బ్లాక్ తనిఖీ



హాజరుపట్టీని పరిశీలిస్తున్న వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ బ్లాక్‌ను ప్రధాన ఆచార్యులు ఎస్. రఘునాథరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఫైన్ ఆర్ట్స్, హిస్టరీ, ఉర్దూ తెలుగు శాఖలలో రికార్డులను పరిశీలించారు. బోధన, బోధనేతర సిబ్బంది హాజరును చూశారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా సమయపాలన పాటించాలని సూచించారు. విధుల నిర్వహణలో బాధ్యత రాహిత్యంగా వ్యవహరించకూడదని సూచించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశాలిచ్చారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.